క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అన్నదానాలు



సామర్లకోట పాత్రులపేటలో నిర్వహించిన అన్నదానం

సామర్లకోట: గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకు స్థానిక 15వ వార్డు పాత్రులపేటలో భారీ అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా ఆలయ కమిటీ నాయకులు బత్తుల రమేష్, బత్తుల శ్రీనివాసు, బొమ్మల రాజు, సాయి, సాంబ, పండు తదితరులు పాల్గొన్నారు. 13వ వార్డు గొల్లపేటలో జరిగిన అన్నదానంలో కౌన్సిలర్ నేతల హరిబాబు, మాజీ కౌన్సిలర్ గంగిరెడ్డి కృష్ణమూర్తి, కమిటీ సభ్యులు పండు, రమణ పాల్గొన్నారు. నీలమ్మ చెరువు వద్ద ఉన్న గణపతి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కొత్తపల్లి: కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందినట్లు ఆదివారం స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని మూలపేట గ్రామానికి చెందిన వాసంశెట్టి ఆనంద్ దుర్గ (30) స్థానికంగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌ను జీవనోపాధి పొందుతున్నాడు. తన ఇంటిలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈ నెల 5వ తేదీ రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని చికిత్స నిమిత్తం బంధువులు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఎస్సై స్వామినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా బట్టీలపై పోలీసుల దాడి

300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కొత్తపల్లి: పొన్నాడ శివారు కోనపాపపేటలో సారా బట్టీలపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో సారా తయారీకి సిద్ధం చేసిన 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక ఎస్సై స్వామినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా తయారు చేయడం, విక్రయించడం నేరమన్నారు. గ్రామాల్లో ఎవరైనా సారా తయారు చేసినా, విక్రయించినా తమకు సమాచారం ఇవ్వాలన్నారు. సారాను పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు.

ప్రజా నాయకుడు 'పోకల' మృతి



గండేపల్లి: మండలంలోని యల్లమిల్లి గ్రామానికి చెందిన ప్రజా నాయకుడు, వైఎస్సార్ సీపీ నేత పోకల వెంకట్రావు (76) ఆదివారం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన జగ్గంపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో తుది శ్వాస విడిచారు. ఈయనే గతంలో సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యుడిగా ప్రజలకు మెరుగైన సేవలందించారు. ఆయన సేవలను గుర్తించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గండేపల్లి మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా నియమించింది. ఆ పదవిలో కొనసాగుతున్న వెంకట్రావు అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని రైతులు వాపోతున్నారు.

పోకల మృతికి సంతాపం

పోకల వెంకట్రావు మృతికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సంతాపం వ్యక్తం చేశారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు యల్లమిల్లిలో పోకల భౌతిక కాయానికి నివాళులర్పించారు. వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, వైఎస్ ఎంపీపీ కుంచే రాజా, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ణి వీరబాబు, పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జీసీఎస్ మండల కన్వీనర్లు తాళ్లూరి మధు, బందారు రాజా తదితరులు వెంకట్రావు మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

మానవత్వం చాటుకున్న ట్రాఫిక్ ఎస్సై



అయోధ్యరామపురం శ్మశాన వాటికలో అంత్యక్రియలు చేస్తున్న ట్రాఫిక్ ఎస్సై గరగారావు

సామర్లకోట: పోలీసులలో కాఠిన్యమే కాదు.. మానవత్వం ఉంటుందని ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు నిరూపించారు. స్థానికంగా బిచ్చమెత్తుకుని జీవించే ఆవుల అంజమ్మ (38) అనారోగ్యంతో ఆదివారం సాయంత్రం మృతి చెందింది. విషయం తెలుసుకున్న గరగారావు ఆమె మృతదేహానికి అయోధ్యరామపురం శ్మశాన వాటికలో సొంత ఖర్చులతో దహన సంస్కారాలు చేసి మానవత్వం చాటుకున్నారు. దీంతో స్థానికులు ఆయనను అభినందించారు.

అక్కచెల్లెమ్మలకు ఆసరా

- మహిళా సంఘాలకు అండగా నిలిచిన ప్రభుత్వం
- మూడేళ్లుగా 15 సంఘాలకు వర్తించని పథకం
- సాంకేతిక సమస్యను పరిష్కరించి మూడేళ్ల సొమ్ములు విడుదల
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

పిఠాపురం: అర్హత ఉన్న ప్రతి మహిళా సంఘానికి వైఎస్సార్ ఆసరా పథకం అందేలా చూడాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాలతో గత మూడేళ్లుగా ఆసరా అందని మహిళా సంఘాలకు ఆసరా అందించారు. వివిధ సాంకేతిక కారణాలతో పిఠాపురం నియోజకవర్గంలో 15 మహిళా సంఘాల సభ్యులకు ఆసరా పథకం నిలిచిపోయింది. సంబంధిత మహిళా సంఘాల సభ్యులు సమస్యను స్థానిక ఎమ్మెల్యే పెండెం దొరబాబు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు ఆసరా పథకం అందని మహిళా సంఘాలకు ఆసరా వర్తించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించడంతో ఇప్పటివరకూ ఆసరా రాని సంఘాలకు నిధులు విడుదలయ్యాయి. దీంతో మహిళా సంఘాల సభ్యులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.



మహిళలకు ఆసరా చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

అర్హతే ప్రామాణికం

అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నాం. పిఠాపురం నియోజకవర్గంలోని పలు మహిళా సంఘాలకు ఇటీవల ఆసరా సొమ్ములు అందించాం. సాంకేతిక కారణాలతో పిఠాపురం నియోజకవర్గంలోని 15 సంఘాలకు ఆసరా పథకం వర్తించలేదు. దీంతో ఆయా మహిళా సంఘాల నన్ను కలిసి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి ఆసరా పథకం అందించేలా చర్యలు తీసుకున్నాం. దీనిలో భాగంగా 15 సంఘాల సభ్యులకు రూ.50 లక్షలు ప్రభుత్వం విడుదల చేసింది. 15 సంఘాల సభ్యులకు మూడు విడతలకు సంబంధించి రూ.37 లక్షల చెక్కులను అందజేశాం.

– పెండెం దొరబాబు, ఎమ్మెల్యే పిఠాపురం

సొమ్ములు రావనుకున్నాం



మాతోటి మహిళా సంఘాలకు ఆసరా వస్తోంది. కాని మా సంఘానికి మాత్రం రావడం లేదు. దీంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కాని మూడు విడతలుగా మా సంఘాలకు రాలేదు. ఇక రాదు అనుకున్న సమయంలో సమస్యను ఎమ్మెల్యే పెండెం దొరబాబు దృష్టికి తీసుకెళ్లాం. ఎలాగైనా మాకు ఆసరా వచ్చేలా చూడాలని వినతిపత్రం అందజేశాం. ఆయన వెంటనే స్పందించారు. ఆయన చొరవతో మాకు రాదనుకున్న ఆసరా వచ్చింది. మాకు మూడు విడతలకు సంబంధించి రూ.1,39,695 వచ్చాయి.

– గది కృష్ణ అచ్చుతామణి, పిఠాపురం

అన్న మాట నిలబెట్టుకున్నారు



అక్కచెల్లెమ్మలకు అండగా ఉంటానని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. అర్హత ఉంటే చాలు పథకాలు అందించాలి అని సీఎం ఇస్తున్న ఆదేశాలు ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా న్యాయం చేస్తున్నాయి. మా సంఘాలకు మూడు విడతలుగా ఆసరా అందలేదు. ఏటా ప్రయత్నం చేశాం. కాని సాంకేతిక కారణాలతో మాకు రాలేదు. చివరకు మా సమస్యను ఎమ్మెల్యే పెండెం దొరబాబు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా మాకు ఆసరా వచ్చింది. నాకు మూడు విడతలకు సంబంధించి రూ.62 వేలు ఆసరా నిధులు అందాయి.

– మేరీ కుమారి, పిఠాపురం

మాక్ జీ20 సదస్సుకు విద్యార్థుల ఎంపిక



పి.దొంతమూరు విద్యార్థులతో నిర్వహించిన మాక్ జీ20 సదస్సు

పిఠాపురం: మండలంలోని పి.దొంతమూరు జెడ్పీ హైస్కూల్‌లో శనివారం నియోజకవర్గస్థాయి మాక్ జీ20 సమావేశం నిర్వహించారు. పలువురు విద్యార్థులు ప్రతిభ చూపి జిల్లాస్థాయి మాక్ జీ20 సదస్సుకు ఎంపికై నట్లు రైజ్ కో ఆర్డినేటర్ ప్రసాద్ ఆదివారం తెలిపారు. పి.దొంతమూరు హైస్కూల్‌కు చెందిన భానుశ్రీ, విజయ, దివ్య, గొల్లప్రోలు మండలం వన్నెపూడి హైస్కూల్‌కు చెందిన అపర్ణ, పిఠాపురం ఏపీఎం మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన లక్ష్మీ ప్రసన్న, జాయ్ దీవెన, పి.వెంకటాపురం గురుకుల పాఠశాలకు చెందిన భావనశ్రీ, హనీ, కొత్తపల్లి మండలం నాగులాపల్లి ఇంగ్లిషు మీడియం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన మధుప్రియ, దుర్గరాజు, పి. తిమ్మాపురం ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన లాస్య, కుమారప్రియం హైస్కూల్‌కు చెందిన సంధూజ జిల్లా స్థాయి మాక్ జీ20 సదస్సుకు ఎంపికైనట్లు ఆయన వివరించారు. వచ్చే వారం జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఆర్జేడీ నాగమణి, యూనివర్సిటీ ఇంగ్లిషు ప్రొఫెసర్ల సమక్షంలో కలెక్టరేట్‌లో నిర్వహించే మాక్ జీ 20 సదస్సులో వీరు పాల్గొంటారని తెలిపారు.



వివిధ దేశాల ప్రతినిధులుగా విద్యార్థులు

శరన్నవరాత్ర ఉత్సవాలకు చకచకా ఏర్పాట్లు



మరిడమ్మ తల్లి

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ తల్లి ఆలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ చింతపల్లి బ్రహ్మాజీ, ఈఓ సీహెచ్ రామ్మోహనరావు తెలిపారు. ఆదివారం వారు స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ మహోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు పూజలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పంచామృతాభిషేకం, లలితా సహస్ర నామ కుంకుమార్చన, వేద పఠనం, రుద్రాభిషేకం, చండీ హోమం తదితర పూజలు ఉంటాయన్నారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారన్నారు.

శ్రీ శారద రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో

సామర్లకోట: మండల పరిధిలో పీబీ దేవంలో ఉన్న శ్రీ శారద రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 25వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడానికి నిర్ణయించినట్లు సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. 12వ తేదీన రాట ముహూర్తం చేస్తున్నామని, 15వ తేదీ ఉదయం కలశ స్థాపన జరుగుతుందన్నారు. 21న విద్యార్థులచే సామూహిక సరస్వతి పూజ, అష్టలక్ష్మీ పూజలు జరుగుతాయని చెప్పారు. 25న పూర్ణాహుతి, అనంతరం అన్నదానం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.



గాదులదొడ్డిలో పసుపు రాట వేస్తున్న భక్తులు

రాట ముహూర్తం

కొత్తపల్లి: స్థానిక గాదులదొడ్డిలోని బాల కనకదుర్గ ఆలయం వద్ద ఆదివారం దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పసుపు రాట వేశారు. ఆలయ వద్ద ఈ నెల 15 నుంచి 24 వరకూ దసరా ఉత్సవాలు నిర్వహించనున్నారు. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రోడ్డుపైనే చేపల వ్యాపారం



అమీనాబాద్ సెంటర్‌లో రోడ్డుపైనే చేపలు విక్రయిస్తున్న మహిళలు



స్తంభించిన ట్రాఫిక్

- తరచూ ట్రాఫిక్ సమస్య
- పట్టించుకోని అధికారులు

కొత్తపల్లి: ఉప్పాడ– కోనపాపపేట బీచ్ రోడ్డులోని అమీనాబాద్ సెంటర్‌లో చేపల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఉదయం, సాయంత్రం మత్స్యకార మహిళలు రోడ్డుపై చేపలను విక్రయిస్తున్నారు. స్థానికంగా మార్కెట్‌కు కేటాయించిన స్థలాన్ని విడిచిపెట్టి చేపల వ్యాపారులు ప్రైవేటు స్థలంలో, నడిరోడ్డుపై వ్యాపారం చేస్తున్నారు. కొనుగోలు దారులతో రోడ్డు కిక్కిరిసిపోతోంది. రోడ్డుపై వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. గంటల కొద్దీ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. అంతా తెలిసినా అధికారులు, పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని వాహన చోదకులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. అమీనాబాద్ మార్కెట్‌లో రేకుల షెడ్డు కూడా ఏర్పాటు చేశారు. దీనిని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మార్కెట్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, రోడ్డుపై చేపల విక్రయాలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హెచ్‌ఎంల సమావేశం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం జోన్–2 పరిధిలోగల ప్రధాన సభ్యులతో ఆదివారం కాకినాడలో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా పలు అంశాలపై చర్చించారు. సంఘం బలోపేతం చేయడం, సీబీఎస్‌ఈ పాఠశాలలకు అర్హులైన హెచ్‌ఎంలను ప్రిన్సిపాల్‌గా నియమించడం, విద్యేతర పనులు తొలగించడం వంటి పలు సమస్యలు పరిష్కరించాలని కోరారు.

స్వామినాథన్ సేవలు మరువలేం

- కాకినాడ ఎంపీ వంగా గీత

పిఠాపురం: వ్యవసాయ రంగానికి హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ చేసిన సేవలు మరువలేమని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. గొల్లప్రోలులో ఆదివారం స్వచ్ఛ గొల్లప్రోలు, స్వామి వివేకానంద జ్ఞానమందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సంస్మరణ సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత స్వామినాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రైతుమిత్ర రూరల్ టెక్నాలజీ పార్కు ఫౌండర్, కృషివల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ సీఈఓ అడ్డాల గోపాలకృష్ణ స్వామినాథన్ సేవలను వివరించారు. కార్యక్రమంలో గొల్లప్రోలు సొసైటీ అధ్యక్షుడు జ్యోతుల భీముడు, కౌన్సిలర్ గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, స్వచ్ఛ గొల్లప్రోలు, స్వామి వివేకానంద జ్ఞాన మందిరం సభ్యులు పాల్గొన్నారు.



స్వామినాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ వంగా గీత

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- సీఐ దుర్గాప్రసాద్

సామర్లకోట: సమాజంలో జరుగుతున్న నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ కె.దుర్గాప్రసాద్ అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక వెలమపేట గణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎక్కువ వడ్డీ వస్తుందని, ఎక్కువ మొత్తం వస్తుందని ఇతరులకు డబ్బులు అప్పులు ఇచ్చి అనేక మంది మోసపోతున్నారని తెలిపారు. అలాగే అనేక మంది ఇతరులను రక రకాలుగా మభ్య పెట్టి మోసం చేస్తున్నారన్నారు. పిల్లలను అల్లరచిల్లరగా తిరగనీయడం వల్ల చెడు స్నేహాలు పట్టే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆయా ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు అనుమానంగా తిరుగుతున్న సమయంలో వెంటనే 100 నెంబరుకు సమాచారం ఇవ్వవచ్చునని చెప్పారు. కోడి పందేలు, జూదం వంటి సంఘటనలు జరుగుతున్న సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలను కొని తెచ్చుకొవద్దని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో గుర్తించిన వారు వెంటనే సమాచారం ఇచ్చి క్షతగాత్రులను రక్షించడానికి ప్రయత్నం చేయాలన్నారు. జరగుతున్న నేరాలకు సంబంధించి ప్రొజెక్టర్ ద్వారా సినిమా ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి వార్డు కౌన్సిలర్ గుబ్బల సత్యనారాయణ అధ్యక్షత వహించగా వార్డు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ

ఆక్రమణల తొలగింపు



అమీనాబాదులో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

కొత్తపల్లి: మండలంలోని అమీనాబాదులో ఆక్రమణలను ఆదివారం అధికారులు తొలగించారు. గ్రామానికి చెందిన పలువురు వీధుల్లోని పాత డ్రైన్లను ఆక్రమించి అక్రమ కట్టడాలు చేపట్టారు. గ్రామాభివృద్ధి పనుల్లో భాగంగా సర్పంచి నక్కా మణికంఠబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ, పంచాయతీ అధికారులు జేసీబీతో ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని రెండు సచివాలయాల పరిధిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.40 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో సీసీ డ్రైన్లు, రోడ్లు నిర్మిస్తామన్నారు. పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగించి డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడతామన్నారు. అభివృద్ధి పనులకు గ్రామస్తులు సహకరించాలని కోరారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం



కాకినాడ ఆసుపత్రిలో బాలుడి తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందజేస్తున్న బూరుగుపూడి

కిర్లంపూడి: బ్లడ్ ఇన్ఫెక్షన్‌తో కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మూడు నెలల బాలుడి వైద్యానికి బూరుగుపూడి డెవలప్‌మెంట్ యూత్ సభ్యులు రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. వివరాల్లోకి వెళితే... బూరుగుపూడి గ్రామానికి చెందిన పమ్మిరెడ్డి త్రిమూర్తులు, దేవీ దంపతుల కుమారుడు కార్తిక్ కొన్ని రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. జ్వరం ఎప్పటికీ తగ్గకపోవడంతో తల్లిదండ్రులు మెరుగైన వైద్యం కోసం కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షలు చేసి బ్లడ్ ఇన్ఫెక్షన్‌గా నిర్ధారించారు. విషయం తెలుసుకున్న బూరుగుపూడి డెవలప్‌మెంట్ యూత్ సభ్యులు దాతల నుంచి రూ. 50 వేలు సమకూర్చారు. కాగా ఆదివారం బూరుగుపూడి డెవలప్‌మెంట్ సంస్థ అధ్యక్షుడు పాఠంశెట్టి తమ్మారావు కాకినాడ ఆసుపత్రికి వెళ్లి బాలుడి తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందజేశారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటున్న యూత్ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

ముగిసిన ఏపీఓల శిక్షణ



ఏపీఓలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఫ్యాకల్టీలు

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరులలోని ఉపాధి హామీ ఏపీఓలకు నాలుగు బ్యాచ్‌లలో నిర్వహించిన శిక్షణ ఆదివారంతో ముగిసింది. శిక్షణకు 166 మంది ఏపీఓలు హాజరైనట్టు ఈటీసీ మేనేజరు పి. శ్రీనివాసరావు తెలిపారు. పీఓలకు ఐదు బ్యాచ్‌లలో శిక్షణ ఇవ్వాల్సి ఉండగా మూడు బ్యాచ్‌లలో 101 మందికి ఇచ్చినట్టు తెలిపారు. మిగిలిన వారికి నవంబరు 7 నుంచి శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఏపీఓలకు ఈటీసీ ఫ్యాకల్టీలు సర్టిఫికెట్లు అందజేశారు. ఈటీసీ ఫ్యాకల్టీలు ప్రసాద్, వెంకటేశ్వరరావు, నిహారిక, ఎస్‌కె మోహిద్దీన్ పాల్గొన్నారు.

పోర్టర్‌కు రూ.వెయ్యి ప్రోత్సాహం

సామర్లకోట: ఒక రైల్వే ప్రయాణికుడి ప్రాణాలు కాపాడిన రైల్వే లైసెన్సు పోర్టర్ వాసు ను అభినందిస్తూ రైల్వే మేనేజరు ఎం.రమేష్ రూ.వెయ్యి నగదు ప్రోత్సాహకం అందజేశారు. జె.వెంకటేశ్వర్లు అనే ప్రయాణికుడు విజయవాడ నుంచి విశాఖపట్టణానికి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తూ గుండె నొప్పితో సామర్లకోట స్టేషన్‌లో దిగి రైల్వే మేనేజర్ రమేష్‌ను వైద్య సాయం కోసం ఆశ్రయించారు. వెంటనే రైల్వే పోర్టర్ వాసును ఇచ్చి స్థానిక ప్రభుత్వాస్పత్రికి పంపారు. ప్రాథమిక వైద్యం అనంతరం 108లో ఆయనను కాకినాడ జీజీహెచ్‌కు తీసుకువెళ్లి ఆయన బంధువులకు సమాచారం అందించారు. వారు సత్వరమే వచ్చి ఆయనను అక్కడ నుంచి కార్పొరేట్ ఆస్పత్రికి తరలించి. ఆదివారం వెంకటేశ్వర్లు ఆరోగ్య పరిస్థితి మెరుగుపడడంతో డిశ్చార్జి అయ్యారు. ఆయన కుమారుడు ప్రకాష్ పోర్టర్ వాసు సేవలను, రైల్వే అధికారుల తీరును అభినందిస్తూ కృతజ్ఞతగా స్టేషన్ మేనేజర్‌కు లేఖ రాశారు. ఈ మేరకు మేనేజరు రమేష్ వాసుకు ప్రోత్సాహకం అందజేశారు.